# పట్టెడు నిప్పు

నేను డిగ్రీలో ఉండగా సిగరెట్లు తాగడం మొదలెట్టాను. మొదట్లో సిగరెట్ వాసన నాకు పడేదికాదు. సిగరెట్లు తాగేవాళ్ళకు దూరంగా ఉండేవాడిని. ఆనందంతో సన్నిహితమయ్యాక అతను సిగరెట్లు తాగుతోంటే నాకు ముచ్చట వేయడం మొదలెట్టింది. పొగను రింగుల్లో, చతురస్రాకారంగా, సిగరెట్లలా వదులుతోంటే సిగరెట్లు తాగాలనే కోరిక మొదలయింది.

ఆనందం నాకంటే పది పన్నెండేళ్ళు పెద్ద. అప్పటికి అతను రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేస్తుండేవాడు. మా ఇద్దరి మధ్య వయసులో అంత తేడా ఉన్నా నాకు దూరపు బంధువు అవటాన బాగా కలిసిపోయి తిరుగుతుండేవాళ్ళం. ఎప్పుడయినా అతని ఆఫీసు వెళ్తే నా కోసం కుర్చీ తెప్పించి తన కుర్చీ పక్కనే వేయించి కూర్చున్నాక టీ తెప్పించేవాడు. ఎంత పనున్నా పక్కన పెట్టేసి నాతో కబుర్లలో దిగేవాడు. అతనికి ఇబ్బంది కలిగించకుండా ఉండటానికి వీలయినంత వరకు అతని ఆఫీసుకు వెళ్లకుండా ఉండేవాడిని.

అప్పట్లో నా దగ్గర డబ్బులు ఉండేవి కావు. నాన్న పాకెట్‌మనీ అంటూ ఏమీ ఇచ్చేవాడు కాదు. మా ఇంటి పరిస్థితి చూస్తూ మా నాన్నను అడగటానికి నాకు మనస్కరించేది కాదు. అప్పుడప్పుడు అమ్మ ఎంతో కొంత ఇస్తుండేది. ఏ మూలకూ వచ్చేది కాదు. అంచాత టీలకు, సిగరెట్లకు, సినిమాలకు ఆనందం మీద ఆధారపడేవాడిని. అన్నిటికీ అతని మీద ఆధారపడడం నాకూ నచ్చేది కాదు. నా కోసం ఖర్చు పెట్టడానికి అతను ఏమనుకునేవాడు కాదు. ఉదయం నిద్రలేవగానే ఇవేళ సిగరెట్ ముట్టకూడదని నిర్ణయించుకునేవాడిని. సాయంత్రం వరకు ఆ

నిశ్చయంతోనే ఉండేవాడిని. సాయంత్రం ఆనందం కలిశాక నా నిర్ణయం గాలికి ఎగిరిపోయేది.

డిగ్రీపూర్తవుతుండగా ఆనందం పెళ్ళి అయింది. పెళ్లయిన కొత్తలో నాతో బాగానే ఉండేవాడు. తర్వాత్తర్వాత అతనిలోని మార్పు కొద్దికొద్దిగా బయట పడడం మొదలుపెట్టింది. అతని ఆఫీసుకు వెళ్తే అతని చూపులో ఆప్యాయత ఉండేదికాదు. పని ఒత్తిడిలో అలా ఉన్నాడేమో అనిపించేది. చొరవగా స్టూలు లాక్కుని అతని పక్కన మునుపటిలా కూర్చుంటే ఇబ్బంది పడటం గమనించాను. రోజూ కలుసుకునే మా కార్యక్రమం వారానికి ఒకసారికి మారి తర్వాత ఎప్పుడయినా దారిలో ఒకరికొకరం ఎదురయితే మాట్లాడుకునేవాళ్ళం. నా అంతట నేను సిగరెట్ అడగడం మానేశాను. తనంతట తాను ఇస్తే తీసుకుని తాగేవాడిని. సిగరెట్‌కు అలవాటు పడిపోయాను. తాగకపోతే చికాకుగా ఉండేది. ఏ కారణం లేకుండా ఎదుటివాళ్ళ మీద విసుగు కలుగుతుండేది.

మా ఇంట్లో మా అన్నయ్య సిగరెట్ తాగేవాడు కాదు. నాన్న చేబ్రోలు పుగాకు తెప్పించుకుని చుట్టలు చేసుకుని తాగేవాడు. ఆ వాసన ఘాటుగా ఉండేది. అందుకని ఆయన ఇంట్లో తాగేవాడు కాదు. మేడమెట్లు మీద కూర్చుని ఎంతో ఆనందంగా తాగేవాడు. ఒకసారి ఇంట్లో ఎవరూ లేనప్పుడు చుట్ట వెలిగించాను. రెండుసార్లు చుట్ట పొగ పీల్చానో లేదో వళ్ళంతా చల్లబడిపోయి నరాలు బిగుసుకుపోయినట్టు అనిపించింది. కళ్లు తిరుగుతోంటే నిలబడలేక కిందపడిపోతానేమో అనిపించింది. చుట్ట దూరంగా విసిరి నోరు శుభ్రంగా కడుక్కుని కూర్చున్న ముప్పావుగంటకు గాని మామూలు మనిషిని కాలేకపోయాను. ఆ తర్వాత చుట్ట ఎప్పుడూ ముట్టుకోలేదు.

సిగరెట్టు కొనుక్కొవడానికి డబ్బులు ఎక్కడా దొరకనప్పుడు నిస్సిగ్గుగా ఆనందం వాళ్ళింటికి వెళ్ళి ఒకటో, రెండో సిగరెట్లు కాని, డబ్బులు కాని తెచ్చుకొనేవాడిని. అతనుండే చోటు మా ఇంటికి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. కొన్నిసార్లు కేవలం ఒక్క సిగరెట్ కోసం అంత దూరం నడిచివెళ్ళాల్సి వచ్చేది. నేను వాళ్ళింటికి రావడం అతనికి ఇష్టంగా ఉండేది కాదనిపించేది. అతన్ని తప్ప ఎవరినీ అడగాలనిపించేది కాదు. ఏ బడ్డీ కొట్టువాడూ ఉద్యోగం లేనివాళ్ళకు అప్పులిచ్చేవాళ్ళు కాదు.

నాకు ఉద్యోగం దొరికి మా ఊరు వదిలి వెళ్ళిపోయే ముందురోజు ఆనందం ఇంటికి వెళ్ళాను. నన్ను ఇంట్లోకి రమ్మనమనలేదు. అయిదు నిమిషాలపాటు ఇంటి బయట నిలబడ్డాక అతను వచ్చాడు. ఇద్దరం అరుగుమీద కూర్చున్నాం. నేను సిగరెట్ అడగలేదు. అడగాలనిపించలేదు. అతనివ్వలేదు. నాకు ఉద్యోగం దొరికిందన్న వార్త అంతదూరం నడిచివచ్చి అతన్ని గమనించాక ఎంచాతనో చెప్పాలనిపించలేదు. పది నిమిషాలేమో కూర్చున్నాను. ఏం మాట్లాడుకోలేదు. అరుగు దిగి లేచి నిలబడి "వెళ్ళొస్తాను" అన్నాను. అతనే అరుగు దిగి చొక్కా జేబులోంచి పది రూపాయలనోటు తీసి నా చేతిలో పెడుతోంటే, "నీకు ఇప్పటికే చాలా బాకీ ఉన్నాను. నేను సిగరెట్ కోసం రాలేదు" అన్నాను. "ఇహ నుండి దయచేసి మా ఇంటికి రాకు. సిగరెట్లు కాని, డబ్బు కాని అడగకు" నెమ్మదిగానే అన్నాడు. అతను అలా అంటాడని నేను ఊహించలేదు. పదిరూపాయలనోటు తీసుకోవాలనిపించలేదు. తప్పు నాదే. మాటిమాటికీ అతనిమీద ఆధారపడకుండా ఉండవలసింది. అతను మటుకు ఎంత కాలమని నన్ను భరిస్తాడు? అతని స్థానంలో మరొకరు ఉండి ఉంటే ఎప్పుడో నన్ను దూరంగా ఉంచేవాళ్ళు. వీధి చివరి వరకు వచ్చి వెనక్కి తిరిగి చూశాను. అతను అక్కడే నిలబడి నా వయిపు చూస్తున్నాడు.

ఉద్యోగంలో నాలుగు సంవత్సరాల వరకు పనుల వత్తిళ్ళ వలన మా ఊరు వెళ్లడం పడలేదు. తర్వాత మా ఊరు వెళ్ళినప్పుడు నాకు ఆనందాన్ని చూడాలని. అతనితో కూర్చుని సిగరెట్లు తాగుతూ ఎన్నో మాట్లాడాలని అనిపించింది. ఒకప్పుడు నాకు సహాయం చేసిన తను ఏదో అన్నాడన్న సంగతి ఎప్పుడో మర్చిపోయాను. ఇప్పుడతని మీద ఎటువంటి కోపం లేదు. ఆ సాయంత్రం అరకిలో జీడిపప్పుమిఠాయి, యాభయి సిగరెట్టు పెట్టెలు తీసుకుని అతనింటికి వెళ్లాను.

పాత ఇంటి స్థానే కొత్త ఇల్లు కట్టాడు. మునుపటి కన్నా సన్నబడ్డాడు. సిగరెట్లు ఎక్కువ తాగడం వల్లనేమో కింది పెదవి తెల్లబడింది. ఇంట్లోకి ఆప్యాయంగా ఆహ్వానించాడు. అతను చూపించిన సోఫాలో కూర్చోబోతూ ముందు జీడిపప్పు మిఠాయి అందించాను. అతనికి అదంటే ఇష్టం. సంతోషంగా తీసుకున్నాడు. సిగరెట్లున్న పేకట్ తీసుకోలేదు. అతని పక్కన పెట్టాను. "నేను సిగరెట్లు తాగడం మానేసి సంవత్సరం దాటింది" అన్నాడు.

"ఎందుకు?" అడిగి రెండుక్షణాలు ఆగి అతని ముఖంలోకి చూసి, "నీ కోసమే తెచ్చాను" అన్నాను.

నవ్వి, "బాకీ తీర్చుకుందామనా?" అడిగాడు.

ముప్పావుగంట అతనితో కూర్చుని తర్వాత సెలవుతీసుకుని బయటకు వస్తోంటే నాకూడా వీధి గుమ్మం వరకు వచ్చి, నా భుజం మీద చేయి వేసి నిమురుతూ, "నేను ఊపిరితిత్తుల కేన్సరుతో బాధపడుతున్నాను. మొదటి దశ దాటింది...." నెమ్మదిగా అన్నాడు. మాటల్లో బాధలేదు. మామూలు విషయం చెబుతున్నట్లుగా చెప్పాడు. నమ్మబుద్ధి కాలేదు. తల అడ్డంగా ఆడించాను. మనసు బాధామయ మయింది.

కొద్దిదూరం వచ్చి మా అమ్మ అతనితో చెప్పమన్నమాట గుర్తువచ్చి చెబుదామని వెనక్కి తిరిగి అతని ఇంటికి వచ్చి కాలింగ్‌బెల్ నొక్కబోతూ లోపలికి తొంగి చూశాను. అతను సోఫాలో చేరగిలిబడి కూర్చుని తాపీగా సిగరెట్ తాగుతున్నాడు.

❖ ఆదివారం వార్త, 2008